రైతులకు అండగా ఉంటాం

- మద్దతు ధర కన్నా తక్కువకు పంటను అమ్మొద్దు
- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య భరోసా
- పలు గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన



వేజండ్లలో అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: అకాల వర్షాలకు పంట దెబ్బతిని, నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య భరోసా ఇచ్చారు. సోమవారం వేజండ్ల, సుద్దపల్లి, శలపాడు, శేకూరు, వీఎస్ పాలెం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే పరిశీలించారు. కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న, తెల్లజొన్న పంట తడిసిందని రైతులు ఎమ్మెల్యేకు వివరించారు. దీని వల్ల గింజలు మొలకెత్తుతున్నాయని, రంగుమారి, నాణ్యత దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. జొన్న పంట తడవటంతో ఫంగస్ వచ్చి గింజలు నల్లబారినట్లు రైతులు చెప్పారు. కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి పూర్తిగా తడిసి నీట నానటంతో కాయలు బూజుపట్టి, రంగుమారి దెబ్బతింటున్నట్లు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఆదుకుంటుందని, రైతులెవరూ మద్దతు ధరకన్నా తక్కువకు పంటను అమ్ముకోవద్దని సూచించారు. పంట నష్ట వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని ఉద్యానవనశాఖ, వ్యవసాయశాఖాధికారులను ఆదేశించారు. ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పొన్నూరు ఏడీఏ సీహెచ్ తిరుమలాదేవి, హెచ్ఓ పి.ఉష, ఏఓ బి.శ్రీనివాసనాయక్, వైఎస్సార్ సీపీ నేతలు జీడీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, కాసు ఈశ్వరరెడ్డి, ముత్యేశ్వరరావు, మగ్బుల్‌ఖాన్, ఎం.పోతురాజు, హనుమంతరావు, ఎన్.రాఘవరావు, మన్నెం వేణుగోపాలరావు, బాలచంద్రయ్య, శ్యామారావు, గుర్రం శంకరరావు, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు వెనిగండ్లలో గడప గడపకు మన ప్రభుత్వం

పెదకాకాని: పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తప్పక హాజరు కావాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ కోరారు.

రేపు లూథరన్ చర్చి ప్రతిష్ఠ

పెదనందిపాడు: పెదనందిపాడు ఆంధ్రా ఇవాంజలికల్ లూథరన్ చర్చి ప్రతిష్ఠా కార్యక్రమం బుధవారం ఉదయం నిర్వహించనున్నట్లు సంఘకాపరి పులిపాటి దైవాశీర్వాదం తెలిపారు. చర్చి ప్రతిష్ఠా కార్యక్రమం సందర్భంగా సోమవారం ఉదయం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ప్రార్థనల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

టెన్త్ విద్యార్థికి అభినందన



గుంటూరు రూరల్: పదో తరగతి ఫలితాల్లో 584 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం సాధించిన జొన్నలగడ్డ జెడ్పీ పాఠశాల విద్యార్థిని గాండ్ల హేమ, ఆమె తండ్రి సత్యనారాయణను సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.సత్యవాణి, సర్పంచ్ మబ్బు శిరీష, ఉపసర్పంచ్ వంగా నవీన్‌రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ మధు, ఉపాధ్యాయులు విద్యార్థిని, ఆమె తండ్రిని సన్మానించారు.

ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కొత్త అధ్యక్షుడిగా నాయుడు ధను



కొత్త అధ్యక్షునిగా ఎన్నికైన నాయుడు ధనుంజయరావు

పెదకాకాని: పెదకాకాని మండల ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలలో అధ్యక్షుడిగా నాయుడు ధనుంజయరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలోనూ ఆయన పెదకాకాని వర్తక సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం డివిజనల్ లీగల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్‌గా పనిచేస్తున్న నాయుడు ధనుంజయరావు గతంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా కోవిడ్-19 సమయంలో ఇతర రాష్ట్రాల కూలీలు సురక్షితంగా ఇంటికి చేరడంలో విశేషంగా కృషి చేశారు. కమిటీ ఆధ్వర్యంలో ఇతర రాష్ట్రాలకు వెళ్ళే ప్రయాణికులకు వారి రాష్ట్రానికి వెళ్ళే రైలు వచ్చే వరకూ అపరకర్మల సత్రంలో ఆశ్రయం కల్పించడంతో పాటు ఉచితంగా ఆహారం, తాగునీరు ఏర్పాటు చేసి పలువురి మన్ననలు పొందారు. పెదకాకాని మండల ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కొత్త కమిటీలో ప్రధాన కార్యదర్శిగా వైఎస్ఆర్ కామేశ్వరరావు, కోశాధికారిగా తడవర్తి అప్పారావు, కార్యదర్శులుగా రేఖా ప్రసాదరావు, బండ్రెడ్డి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా కనమర్లపూడి శ్రీకృష్ణ, షేక్ ఆరిఫ్‌లు, సత్రం నిర్వాహకులుగా నల్లూరి శేషగిరిరావు, లింగంగుంట సాల్మన్‌రాజు ఎన్నికయ్యారు.

గురుద్రోహి సన్యాస దీక్ష రద్దు



పాత గుంటూరు: తన వద్ద సన్యాస దీక్ష తీసుకున్న సాంబశివానంద భారతి(అలవలపాటి రామ్మోహన్) తమ పీఠ ప్రతినిధి అని అసత్య ప్రచారం చేస్తున్నారని, అది వాస్తవం కాదని శ్రీ శృంగేరి విరూపాక్ష పీఠాధిపతులైన గంభీరానంద భారతీస్వామి తెలిపారు. అరండల్‌లోని శృంగేరి విరూపాక్ష పీఠంలో సోమవారం విలేకరుల సమావేశంలో స్వామి మాట్లాడారు. పరమపూజ్య శ్రీ కుర్తాళం పీఠాధిపతుల గురించి అసత్య ప్రచారం చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. గురుద్రోహం, హిందూ ధర్మ విరుద్ధమైన పనులు చేస్తున్న సాంబశివానంద భారతి సన్యాస దీక్షను రద్దు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. నేటి నుంచి అతనికి, తమ పీఠానికి ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు.

విజ్ఞాన్ వర్సిటీ అధ్యాపకుడికి పీహెచ్‌డీ



చిన్నం శివకోటేశ్వరరావుకు పీహెచ్‌డీ పట్టాను అందజేస్తున్న విజ్ఞాన్ వీసీ నాగభూషణ్ తదితరులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ చిన్నం శివకోటేశ్వరరావుకు తమ యూనివర్సిటీ సీఎస్ఈ విభాగంలో సోమవారం పీహెచ్‌డీ పట్టా అందించిందని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ తెలిపారు. మల్టీ మోడల్ అటెన్షన్ కాస్కేడ్ యూనెట్ ఆర్కిటెక్చర్ ఫర్ 3డీ బ్రెయిన్ ట్యూమర్ సెగ్మెంటేషన్ అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని వివరించారు. పరిశోధనలో భాగంగా మొత్తం 2 ఎస్‌సీఐ, 2 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ పేపర్లు పబ్లిష్ చేశారని వెల్లడించారు. పీహెచ్‌డీ పట్టా పొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ చిన్నం శివకోటేశ్వరరావును పలువురు అభినందించారు.

మనబడి నాడు-నేడు పనులు సకాలంలో పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ కెనడీ

కాకుమాను: మండలంలోని గ్రామాలలో మనబడి నాడు-నేడు రెండోదశ ద్వారా జరుగుతున్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంఈఓ కెఎఫ్ కెనడీ చెప్పారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం మనబడి నాడు-నేడు రెండో దశ పనులపై హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలనే లక్ష్యంతో మనబడి నాడు-నేడు అనే పథకాన్ని చేపట్టి పాఠశాలల రూపు రేఖలను మారుస్తున్నట్లు ఆయన తెలిపారు. ఫేజ్-2 ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులు పాఠశాలలు ప్రారంభం నాటికల్లా పూర్తి చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో పంచాయతీ రాజ్ ఏఈ ఆనందరావు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా దేశభక్తి



శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ పార్వతి తదితరులు

చేబ్రోలు: చేబ్రోలులోని ప్రెసిడెన్సీ హైస్కూల్‌లో జరుగుతున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపానం, రాజ్యపురస్కార్ ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ పి.పార్వతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు రెండు వందల మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు. పి.పార్వతి మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని, క్రమశిక్షణను పెంచి వారిని సమాజ సేవకులుగా తీర్చిదిద్దటమే స్కౌట్స్ అండ్ గైడ్స్ ముఖ్య ఉద్దేశమన్నారు. తమిళనాడుకు చెందిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎస్‌వోసీ కమల్ కనన్ మాట్లాడుతూ సదా సమాజసేవలో ఉంటాం అనే నినాదంతో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన గుమ్మా నాగలక్ష్మి, సాయి శ్రీహాసినిలకు పార్వతితోపాటు స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు మెమెంటోలు అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ వాసిరెడ్డి బస్‌బాబు, స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ జాయింట్ డైరెక్టర్ డీఆర్‌కే శర్మ, స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, అసోసియేషన్ సెక్రటరీ డీఎల్ నారాయణ, ప్రిన్సిపాల్ ఆశాలత పాల్గొన్నారు.

రేపటి నుంచి హనుమత్ జయంత్యుత్సవాలు



గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న ఈవో శ్రీనివాసరావు, చైర్మన్ జయప్రకాష్‌రెడ్డి తదితరులు

పాత గుంటూరు: కొత్తపేటలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 10వ తేదీ నుంచి 14 వరకు హనుమత్ జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈవో డి. శ్రీనివాసరావు తెలిపారు. దేవస్థానం ఆవరణలో సోమవారం ఉత్సవాల గోడప్రతులు, బుక్‌లెట్స్ ఆవిష్కరించారు. ఈవో మాట్లాడుతూ 10న అంకురార్పణ, 11న లక్ష తులసి పూజ, 12న లక్ష మల్లెల పూజ, 13న లక్ష ఆకు పూజ, రాత్రి గ్రామోత్సవం, 14న సహస్ర ఘటాభిషేకం, రాత్రి శ్రీ సువర్చలాంజనేయస్వామి కల్యాణం, 15న అన్నదానం నిర్వహిస్తున్నట్లు వివరించారు. భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జయప్రకాష్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకటజ్యోతి, నరేష్ కుమార్, హనుమాన్ దీక్ష సమాజం లీగల్ అడ్వైజర్ జూపూడి రంగరాజు, అధ్యక్షుడు తిరువల్లూరి వెంకట సుబ్బారావు, సభ్యులు అనిల్ కుమార్, నాగేశ్వరరావు, వెంకట రమణ, వంశీ ప్రసాద్, జనసేన నగర అధ్యక్షుడు ఎన్. సురేష్, బీజేపీ నేత డాక్టర్ ఉమాశంకర్ పాల్గొన్నారు.

స్థిరమైన లక్ష్యంతోనే సివిల్స్‌లో విజయం



శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న అశ్విన్ మణిదీప్

గుంటూరు ఎడ్యుకేషన్: స్థిరమైన లక్ష్యం, కృషి, పట్టుదలతో సివిల్స్‌లో విజయం తథ్యమని ఐఆర్‌ఎస్ అధికారి అశ్విన్ మణిదీప్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో కేవీఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ (సన్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐఏఎస్ ఫౌండేషన్ తరగతుల్లో భాగంగా సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సివిల్స్‌కు సన్నద్ధతలో పాటించాల్సిన విధానాలు, సమకాలీన అంశాల గురించి వివరించారు. ఈనెల 16వ తేదీ వరకు తరగతుల్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కె.సాయికుమార్, సీహెచ్.బాలు, ఎం. అజయ్, పీర్ సాహెబ్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సందడి



విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

కాకుమాను: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 1994-95 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం సోమవారం పాఠశాలలో ఉత్సాహంగా జరిగింది. పూర్వ విద్యార్థులు రోజంతా ఆహ్లాదంగా గడిపారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. కొత్త వస్త్రాలతో సత్కరించారు. తొలుత పాఠశాల స్థల దాత స్వర్గీయ నన్నపనేని నాగయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అప్పటి గురువులతో గ్రూప్ ఫొటో దిగారు.

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు



ప్రత్తిపాడులో విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న ఎంఈఓ రమాదేవి



పెదనందిపాడులో వేసవి విజ్ఞాన శిబిరంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గేరా మోహన్‌రావు



పెదకాకాని లూథర్‌గిరికాలనీ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న సర్పంచి గోళ్ళ స్వరూపరాణి



కాకుమానులో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ గుల్జార్ బేగం

పెదకాకాని/ప్రత్తిపాడు/పెదనందిపాడు/గుంటూరు రూరల్/కాకుమాను: ప్రభుత్వం విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి గోళ్ళ స్వరూపరాణి అన్నారు. పెదకాకాని లూథర్‌గిరికాలనీ గ్రంథాలయంలో జూన్ 6వ తేదీ వరకూ నిర్వహించే సమ్మర్ క్యాంప్‌ను సోమవారం గ్రామ సర్పంచి గోళ్ళ స్వరూపరాణి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామ సర్పంచి గోళ్ళ స్వరూపరాణి మాట్లాడుతూ చిన్నారులు శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు. శిక్షణ పూర్తిచేసిన అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తామని గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి గోళ్ళ శ్యాంముఖర్జీబాబు, మహిళా మండలి అధ్యక్షురాలు కామినేని పూర్ణిమ, తక్కెళ్ళపాడు ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ఇమ్మానియేల్, కొప్పురావూరు బీడీసీ నిర్వాహకులు మాధవిలత తదితరులు పాల్గొన్నారు.

- ప్రత్తిపాడులోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని ఎంఈఓ సీహెచ్ రమాదేవి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అరుణ, అక్షయ స్కూల్ డైరెక్టర్ వెలగా శ్రీవల్లి, విద్యార్థులు పాల్గొన్నారు.
- పెదనందిపాడు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గేరా మోహన్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు పి.సుభాషిణి, విశ్రాంత ఉపాధ్యాయులు గుగ్గిలం సాయిబాబు, మంజుల, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.
- గుంటూరు రూరల్ మండలం 16వ డివిజన్ ఏటుకూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయ అధికారి పి.పరమేశ్వరి ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ లక్ష్మీదుర్గ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
- కాకుమాను శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.శరత్ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్,షేక్ అసదుల్లా, గ్రంథాలయ అధికారి జోగి మోహనరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన సోమవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం లాలుపురం గ్రామానికి చెందిన తోట పుల్లారావు తన ద్విచక్రవాహనంపై విజయవాడవైపుగా హైవేలో వెళుతున్నాడు. ఈ క్రమంలో వేగంగా నడుపుతుండగా ఎదురుగా విజయవాడవైపు వెళుతున్న కారును వెనుకనుంచి ఢీకొన్నాడు. ప్రమాదంలో పుల్లారావుకు గాయాలు కావటంతో స్థానికులు అతనిని 108లో జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఆస్పత్రిలో పరీక్షించిన వైద్యులు క్షతగాత్రుని పరిస్థితి బాగానే ఉందని తెలిపారు. ఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి



వృద్ధురాలి మృతదేహం

గుంటూరు రూరల్: గుర్తు తెలియని సుమారు 70 ఏళ్ల వృద్ధురాలు మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం పెదపలకలూరు గ్రామం ఎల్ఐసీ కాలనీ నుంచి గోర్లవారిపాలెం వెళ్ళే రోడ్డులో నారాయణ కళాశాల సమీపంలో వృద్ధురాలు మృతి చెందిందని పోలీసులకు స్థానికులు సమాచారం అందించటంతో ఘటన స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించామని సీఐ పేర్కొన్నారు. కాషాయ రంగు చీర ధరించి ఉందని వివరించారు. వివరాలు తెలిసిన వారు 8688831607 సెల్ నంబర్‌కు గానీ నేరుగా పోలీస్ స్టేషన్‌లోగానీ సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



చేబ్రోలు మండలం నారాకోడూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న బైక్

చేబ్రోలు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామంలో సోమవారం జరిగింది. పొన్నూరు గ్రామానికి చెందిన కొసరాజు కరుణానిధి కారులో గుంటూరు వైపు వెళ్తుండగా నారాకోడూరులోని మసీదు ఎదురుగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. బైక్ ముందుభాగం దెబ్బతింది. ఈ ఘటనలో గుంటూరు నల్లచెరువు ప్రాంతానికి చెందిన షేక్ మహ్మమద్ రఫీవుల్ అహ్మద్‌కు గాయాలయ్యాయి. బైక్‌పై ఉన్న మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరిని 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీపీఎస్సీ సభ్యురాలు సెలీనాకు అభినందనలు

ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మలపాటి మోజెస్



డాక్టర్ సెలీనాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ మోజెస్, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) సభ్యురాలిగా డాక్టర్ బీఎస్ సెలీనా నియామకంపై ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మలపాటి మోజెస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం మంగళగిరిలోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో అకడమిక్ అధికారిగా పని చేస్తున్న సెలీనాను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మోజెస్ మాట్లాడుతూ ఏసీ కళాశాల పూర్వ విద్యార్థిని అయిన డాక్టర్ బీఎస్ సెలీనాను సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఏపీపీఎస్సీ సభ్యురాలిగా నియమించడం ద్వారా విద్యారంగంలో ఆమె సాధించిన అపారమైన అనుభవానికి తగిన గుర్తింపు ఇచ్చారని తెలిపారు. సెలీనా తండ్రి బి. చంద్రపాల్ ఏసీ కళాశాల ప్రిన్సిపాల్‌గాను, ఆమె తల్లి సూజన్ ప్రమీల బోటనీ అధ్యాపకురాలిగా పని చేశారని చెప్పారు. ఈసందర్భంగా డాక్టర్ సెలీనాకు కళాశాల కరస్పాండెంట్, మోడరేటర్ బిషప్ డాక్టర్ కేఎఫ్ పరదేశిబాబు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ ఎం.ఎస్ శ్రీధర్, అధ్యాపకులు ప్రీతం ప్రకాష్, ఎజ్రా విజయశేఖర్, పీఎం వినయతేజ పాల్గొన్నారు.